నేడు విద్యుత్ సరఫరా అంతరాయం

విశాలాంధ్ర-పలాస: పలాస కాశీబుగ్గ మున్సిపాలిటీ కేటీ రోడ్డు విస్తరణ పనుల్లో భాగంగా మంగళవారం ఉదయం 9 గంటల నుంచి సాయంత్రం 4 గంటల వరకు విద్యుత్ సరఫరా నిలిపివేస్తున్నట్లు కాశీబుగ్గ విద్యుత్ ఏఈ నాగభూషణ్ ఒక ప్రకటనలో తెలిపారు. కాశీబుగ్గ పరిధిలో ఉన్న హరి శంకర్ థియేటర్, కాశీబుగ్గ మూడు రోడ్ల కూడలి, తిలక్ నగర్, మల్లేశ్వర హాస్పిటల్ రోడ్, బాలకృష్ణ హాస్పిటల్ రోడ్, ఆంధ్రా బ్యాంకు రోడ్, గున్నేశ్వర నగర్, ఎస్ ఎం డి కాంప్లెక్స్ ప్రాంతం , న్యూ కాలనీ, దుర్గ మండపం , పోలీసుస్టేషన్, పెద్ద బ్రాహ్మణ వీధి, చిన్న బ్రాహ్మణ వీధి, పూజారి వీధి, వెంకటేశ్వర కాలనీ, ఫిష్ మార్కెట్, మేదరవీధి, నిత్యానంద నగర్, మీసేవ సంత ఏరియా తదితర ప్రాంతాల్లో విద్యుత్ సరఫరాకు అంతరాయం ఉంటుందని దీన్ని పట్టణ ప్రజలు సహకరించాలని కోరారు.

టిడిపి కార్యకర్తపై వైసిపి కార్యకర్త దాడి

విశాలాంధ్ర-పలాస: మందస మండలం లింబుగాం గ్రామానికి చెందిన టిడిపి సోషల్ మీడియా కార్యకర్త తలగన రాజశేఖర్ పై పలాస లేబర్ కాలనీకి చెందిన వైసిపి కార్యకర్త గేదెల సాయి సోమవారం దాడి చేశాడు. తలగాన రాజశేఖర్, నర్తు ఈశ్వరరావులు కలిసి కాశీబుగ్గ సాయిరాం మెస్ లో భోజనం చేస్తూ వారిలో వారు టిడిపి రాష్ట్ర ప్రధాన కార్యదర్శి గౌతు శిరీష కోసం మాట్లాడుతుండగా ఎదురుగా కూర్చున్న గేదెల సాయి మీది ఏ గ్రామం అని అడుగగా మా విషయాలు నీకుందకని అనడంతో రాజశేఖర్ పై సాయి దాడి చేయడం తో మొఖం, కన్ను పై తీవ్ర గాయాలయ్యాయి. ఘటనా జరిగిన వెంటనే క్షతగాత్రుడును పలాస ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. ఈ సందర్భంగా క్షతగాత్రుడు రాజశేఖర్ మాట్లాడుతూ తన పై దాడి చేయడమే కాకుండా తన వద్ద ఉన్న రూ.5 వేలు పట్టుకుపోయాడని బాధితుడు తెలిపాడు.

కొండపేట జంక్షన్ సమీపంలో రోడ్డు ప్రమాదం

ద్విచక్రవాహనదారుడు మృతి

విశాలాంధ్ర-బూర్జ : బూర్జ మండలంలోని అన్నంపేట పంచాయితీ జంగాలపాడు గ్రామానికి చెందిన సవర వసంత వయసు 40 సంవత్సరాలు ద్విచక్ర వాహనంపై వెళ్తూ ప్రమాదానికి గురై పాలకొండ ఏరియా ఆసుపత్రిలో చికిత్స పొందుతూ చివరి శ్వాస విడిచారు. వివరాల్లోకి వెళితే కొండపేట జంక్షన్ సమీపంలో ఏపీ31టీటీ 7259 వాహనానికి ఢీకొని ప్రమాదం జరిగిందని, పాలకొండ ఏరియా ఆసుపత్రికి 108 అంబులెన్స్ ద్వారా తరలించినట్టు ఎస్సై అశోక్‌బాబు తెలియజేశారు. లారీని అదుపులో తీసుకొని దర్యాప్తు చేస్తున్నామని తెలియజేశారు. వసంత్ మరణంతో జంగాలపాడు గ్రామంలో విషాదఛాయలు కమ్ముకున్నాయి.

వంశదార కాలువలో పడి బాలుడు మృతి

విశాలాంధ్ర-కోటబొమ్మాళి : మండలంలోగల కస్తూరిపాడు గ్రామ సమీపంలో గల వంశధార కాలువలో పడి ఒడిస్సా రాష్ట్రం రౌడికిలకు చెందిన నెయ్యిల దుర్గారావు (15) అనే బాలుడు మృతి చెందాడు. వివరాల్లోకి వెళితే మృతుడు దుర్గారావు తన బంధువు అయిన కస్తూరిపాడు గ్రామానికి చెందిన నెయ్యిల అప్పన్న వివాహానికి ఈనెల 19వ తేదీన కస్తూరిపాడు గ్రామానికి వచ్చి 20వ తేది సాయంత్రం స్నానానికని దగ్గరలో ఉన్న వంశధార కాలువకు మృతుడు దుర్గారావుతో పాటు చిన్ని, హరిక్రిష్ణ కాలువలో స్నానానికి దిగగా కాలువలో నీరు ఉధృత్తంగా రావటంతో ఈత రాక దుర్గారావు కాలువలో కొట్టుకుపోయాడు. దీంతో గ్రామస్థులు కాలువలో గాలించగా ఫలితం లేకపోవడంతో స్థానిక పోలీసులకు ఫిర్యాదు చేయటంతో స్థానిక పోలీసులు, ఫైర్ సిబ్బంది, రిస్కటీం గాలింప చర్యలు చేపట్టగా ఆదివారం రాత్రి మృతదేహం లభ్యమైంది. మృతదేహాన్ని పోస్టుమర్టం కోసం స్థానిక ప్రభుత్వ అసుపత్రికి తరలించి స్థానిక హెచ్‌సీ వై.లక్ష్మణరావు కేసు నమోదుచేసి ధర్యాప్తు చేస్తున్నారు.

నేడు బిఆర్‌ఏయులో సుపరిపాలన దిశగా ఏపీ రూపాంతరం సదస్సు

- హాజరుకానున్న ప్రెస్ అకాడమీ ఛైర్మన్

విశాలాంధ్ర -ఎచ్చెర్ల: డాక్టర్ బి.ఆర్ అంబేద్కర్ యూనివర్సిటీలో సుపరిపాలన దిశగా ఆంధ్రప్రదేశ్ రూపాంతరం అనే అంశంపై మంగళవారం సదస్సు నిర్వహించనున్నట్లు వర్సిటీ రిజిస్ట్రార్ ప్రొఫెసర్ సిహెచ్ ఎ రాజేంద్రప్రసాద్ తెలిపారు. అవర్ స్టేట్ వైఎస్ఆర్ ఇంటలెక్చువల్ ఫారం నిర్వహిస్తున్న ఈ కార్యక్రమంలో ప్రెస్ అకాడమీ చైర్మన్ కొమ్మినేని శ్రీనివాసరావు, విసి ప్రొఫెసర్ నిమ్మ వెంకటరావు జిల్లా కలెక్టర్ శ్రీకేష్ బి లట్కర్, టీటీడీ మాజీ చైర్మన్ వై వి సుబ్బారెడ్డి, ఆచార్య నాగార్జున యూనివర్సిటీ పూర్వపు విసి ప్రొఫెసర్ వి బాల మోహన దాస్ ఫారం వ్యవస్థాపక కార్యదర్శి జి శాంతమూర్తి ఇన్నోవేటివ్ సొసైటీ ఆఫ్ ఏపీ జాయింట్ డైరెక్టర్ లావణ్య తదితరులు పాల్గొంటారని చెప్పారు.

రోడ్ల మరమ్మతులకు స్పందించిన కలెక్టర్

విశాలాంధ్ర-శ్రీకాకుళం టౌన్: నియోజకవర్గంలో ఐటీడీఏ నుంచి గానీ, ఎన్ఆర్ఈజీఎస్ నిధుల నుంచి సుమారు ఐదు గ్రామాల రోడ్ల మరమ్మతులకు చర్యలు చేపట్టాలని జిల్లా కలెక్టర్‌కు సోమవారం గ్రీవెన్స్‌లో కోరడం జరిగిందని, వైసీపీ యువ నాయకులు, పోలాకి జెడ్పీటీసీ సభ్యులు ధర్మాన కృష్ణ చైతన్య మీడియాకు సోమవారం తెలిపారు. ప్రతీ సోమవారం జరిగే స్పందన కార్యక్రమానికి నగరంలోని జిల్లా పరిషత్ సమావేశ మందిరంలో ఆయన జిల్లా కలెక్టర్‌కు వినతి పత్రం అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఐటీడీఏ నుంచి గానీ, ఎన్ఆర్ఈజీఎస్ నిధుల నుంచి సుమారు ఐదు గ్రామాల రోడ్ల మరమ్మతులు చేయాలని జిల్లా కలెక్టర్‌కు సోమవారం గ్రీవెన్స్‌లో కోరడం జరిగిందని, ఆయన స్పందిస్తూ ఎన్ఆర్ఈజీఎస్ నిధుల నుంచి రోడ్ల మరమ్మతులు చేపట్టేందుకు హామీ ఇచ్చారని తెలిపారు. అలాగే పోలాకి మండలం, గుప్పెడు పేట గ్రామంలో గల అంగన్‌వాడీ సెంటర్‌ను తెరిచేందుకు చర్యలు తీసుకోవాలని కోరగా అంగన్‌వాడీ సెంటర్‌ను తెరిచేందుకు అధికారులకు ఆదేశాలిచ్చారని, నరసన్నపేటలో పారిశుధ్య నిర్వహణకు సిబ్బందిని పెంచాలని కోరామని దీనికి స్పందించిన కలెక్టర్ డీపీవోకు ఆదేశాలిచ్చారన్నారు. సాధారణ వ్యక్తుల నుంచి పెద్దవారి వరకు ఎవరైనా స్పందన కార్యక్రమం ద్వారా అధికారులకు వారి సమస్యలు విన్నవించి సమస్యల పరిష్కరించుకునే విధంగా చర్యలు తీసుకుంటున్న రాష్ట్ర ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డికి కృతజ్ఞతలు తెలియజేస్తున్నట్లు వివరిచారు.

పౌష్టికాహారంతో సంపూర్ణ ఆరోగ్యం

విశాలాంధ్ర-వజ్రపుకొత్తూరు : పౌష్టికాహారం అందించడం ద్వారా పిల్లలు, గర్భిణీ, బాలింతలకు సంపూర్ణ ఆరోగ్యమని కాశీబుగ్గ ఐసిడిఎస్ ప్రాజెక్టు పీఓ డి. శార్వాణి అన్నారు. సోమవారం సీతాపురం అంగన్వాడీ కేంద్రాన్ని సందర్శించారు. రికార్డు లను పరిశీలించి నయ సంతృప్తి వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ అంగన్వాడీ కేంద్రాలలో పిల్లల హాజరు శాతం పెంచేలా కృషి చేయాలి అన్నారు. అంగన్వాడీ కేంద్రాలు ద్వారా బలవర్ధకమైన ఆహారం అందిస్తున్నట్లు తెలిపారు. ప్రీ స్కూల్ పిల్లలకు ప్రత్యేక అభ్యాసన ద్వారా శిక్షణ ఇస్తున్నట్లు తెలిపారు. పిల్లలను చదువుకొనేందుకు అనువుగా సంసిద్ధం చేయడం జరుగుతుంది అన్నారు. పిల్లలను అంగన్వాడీ కి పంపించాలని తల్లిదండ్రులకు సూచించారు. పిఓ తో పాటు సూపర్ వైజర్ గంగమ్మ, కార్యకర్త బమ్మిడి భాగ్యవతి ఉన్నారు.

వికలాంగునికి బ్యాటరీ మోటార్ సైకిల్ అందజేత

విశాలాంధ్ర-కవిటి: మండలంలోని బి.గొన పపుట్టుగ గ్రామానికి చెందిన ఆరంగి రాఘవేంద్ర(బబ్లు) పుట్టుకతో వికలాంగుడు. ఈ విషయాన్ని చండి పుట్టుక గ్రామానికి చెందిన యువకులు అశోక్, సురేష్ ఇరువురు కలిసి వైజాగ్‌లో ఉద్యోగ రీత్యా బాధ్యతలతో ఉన్న రోహన్ కుమార్ ద్రుష్టి లో ఉంచారు. ఆయన వెంటనే స్పందించి సుమారుగా 90 వేలు విలువ చేసిన బ్యాటరీ మోటార్ వైకిల్ రాఘవేంద్రకు అందజేశారు. ఈ సందర్భంగా వికలాంగుడైన రాఘవేంద్రరావు ప్రత్యేకంగా రోహన్ కుమార్‌కు ఛండిపుట్టుగ గ్రామస్తులకు కృతజ్ఞతలు తెలియజేశారు. ఈ కార్యక్రమంలో బి గొనపపుట్టుగ సర్పంచ్ బద్రి ప్రకాష్, పిఎసిఎస్ డైరెక్టర్ ఎన్ని అశోక్, రమేష్, సురేష్, నరసింహమూర్తి, ఎన్ని దేవరాజు తదితరులు పాల్గొన్నారు.

సరిహద్దు స్థలాన్ని పరిశీలించిన ఎంపిపి

వంతెన పనులు ప్రారంభించిన ఒడిస్సా

విశాలాంధ్ర-మందస : మందస మండలం ఆంధ్రా ఒడిస్సా సరిహద్దు సమస్య తలనొప్పిగా తయారైంది. ఎన్నో దశాబ్దాల నుంచి ఈ సమస్య ఉన్నా పాలకులు అధికారులు పట్టించుకోకపోవడం వలన సరిహద్దు ప్రజల్లో ఆందోళన నెలకొంది. మండలం బుడారిసింగి సమీపంలో గల కళింగధళ్ రిజర్వాయరు ప్రాజెక్టు దిగువన ఆంధ్రా ఒడిస్సా రాష్ట్రాల మధ్య ఉన్న సరిహద్దు సమస్య నేటికి పరిష్కారం కాలేదు. ఇటీవల ఒడిస్సా ప్రభుత్వం డ్యామ్‌కు సమీపంలో ఆంధ్ర రాష్ట్రానికి చెందిన స్థలంలో భారీ స్థాయిలో వంతెన పనులు ప్రారంభించింది. ఈ సమాచారం తెలుసుకున్న మందస ఎంపిపి డొక్కరి దానయ్య, బుడారిసింగి సర్పంచ్ సురేష్ పాణిగ్రాహిలతో పాటు మండలానికి చెందిన ప్రజాప్రతినిధులు అక్కడికి చేరుకొని ఆ స్థలంను పరిశీలించారు. సంబంధిత స్థలం ఆంధ్రప్రదేశ్‌కు చెందిందని ఒడిస్సా ప్రభుత్వం ఆ స్థలంలో అక్రమంగా వంతెన నిర్మాణ పనులు చేపడుతున్నారని ఎంపిపి దానయ్య తెలిపారు. ఈ విషయమై ప్రభుత్వాధికారులు ఆ స్థలాన్ని పరిశీలించి తగు చర్యలు తీసుకోవాలని కోరారు.

స్పందన ఫిర్యాదులపై శాశ్వత పరిష్కారం చూపాలి - ఎస్పీ రాధిక

విశాలాంధ్ర-శ్రీకాకుళం స్పోర్ట్స్/క్రైం: స్పందన ఫిర్యాదులపై శాశ్వత పరిష్కారం చూపాలని పోలీసు అధికారులను జిల్లా ఎస్పీ జి.ఆర్.రాధిక ఆదేశించారు. సోమవారం జిల్లా పోలీసు కార్యాలయంలో నిర్వహించిన స్పందన కార్యక్రమంలో భాగంగా జిల్లా ఎస్పీ తోపాటు అదనపు ఎస్పీ టి.పి.విఠలేశ్వరరావు, జె.తిప్పేస్వామి ఫిర్యాదుదారులతో నేరుగా మాట్లాడి వారి యొక్క సమస్యలను తెలుసుకొని ఫిర్యాదులపై తగిన చర్యలు తీసుకోవాలని సంబంధిత అధికారులకు ఆదేశించారు. జిల్లా ఎస్పీ కార్యాలయానికి 32 ఫిర్యాదులు అందాయి. ఈ సందర్భంగా సమస్య పరిష్కారం కొరకు స్పందన కార్యక్రమం నకు వచ్చిన వృద్ధురాలు వద్దకు జిల్లా ఎస్పీ స్వయంగా వెళ్లి సమస్యను అడిగి తెలుసుకుని సంబంధిత అధికారికి ఫోన్లో మాట్లాడి తక్షణ పరిష్కారం చూపించాలని ఎస్పీ సూచించారు. సమస్యలకు సానుకూలంగా స్పందించి ప్రతి ఒక్కరిని అర్జీల విషయాలు అడిగి తెలుసుకొని సంబందిత పోలీస్ స్టేషన్ల పరిదిలోని అధికారులకు తక్షణమే ఫోన్ కాల్ ద్వార సమాచారం అందించి ప్రజల ఫిర్యాదులను త్వరితగతిన పరిష్కరించే విధంగా చర్యలు తీసుకువాలన్నారు.

పాముకాటులో వ్యక్తి మృతి

విశాలాంధ్ర-పొందూరు: మండలం బి. కంచరాం గ్రామానికి చెందిన వందన బాస్కర రావు(33) పాముకాటుతో మృతిచెందాడు. బాస్కరరావు శనివారం సాయంత్రం పాము కాటుతో పొలంలోనే మృతిచెందినప్పటికీ ఆదివారం ఉదయం గుర్తించారు. శనివారం సాయంత్రం పొలంకి వెళ్ళిన బాస్కరరావు రాత్రికి ఇంటికి రాకపోవడంతో కుటుంబ సభ్యులు ఆందోళన చెందారు. ఆదివారం ఉదయం పొలంపనులకు వెళ్ళిన రైతులు పొలం లో పడిఉన్న వ్యక్తి గుర్తించారు. సమీపంలోకి వెళ్ళి చూడగా బాస్కరరావుగా గుర్తించి కుటుంబసభ్యులకు సమాచారం అందించారు. అప్పటికే బాస్కరరావు మృతిచెందినట్లు గుర్తించారు. కాళ్ళుపై కోరలు గుర్తులు ఉండడంతో పాముకాటుతో మృతిచెందినట్లు నిర్ధారించుకున్నారు. మృతినికి భార్య పావని, ఇద్దరు పిల్లలు ఉన్నారు. కుటుంబ సభ్యులు పిర్యాదుతో ఎస్సై లక్ష్మణరావు పంచనామా నిర్వహించి మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్త రిమ్స్ కు తరలించారు. కేసు నమోదుచేసి దర్యాప్తు చేస్తున్నారు..

మాజీ సైనికుల అసోసియేషన్ ఏర్పాటు

విశాలాంధ్ర-ఎచ్చెర్ల: మండలంలోని ఫరీద్ పేట గ్రామంలో మాజీ సైనికుల సంక్షేమ సంఘం ఏర్పాటయింది. గ్రామంలోని మాజీ సైనికులంతా సోమవారం సమావేశమై కార్యవర్గాన్ని ఎన్నుకున్నారు. సంఘం అధ్యక్షునిగా సిపాన అప్పారావు, ప్రధాన కార్యదర్శిగా పైడి నారాయణమూర్తి, గౌరవాధ్యక్షుడిగా పైడి నాగేశ్వరరావు, కార్యదర్శిగా పైడి వెంకట నారాయణ, కోశాధికారిగా పైడి రంగనాథం, ఉపాధ్యక్షునిగా సనపల పల్గున రావు, పైడి అప్పన్న, రామారావు తదితరులు ఎన్నికయ్యారు. ఈ సందర్భంగా అధ్యక్షుడు సీపానా అప్పారావు మాట్లాడుతూ మాజీ సైనికుల సంక్షేమంతో పాటు గ్రామ అభివృద్ధిలో భాగస్వామ్యం అవుతామని చెప్పారు.

వరుస క్రమంలో వరి విత్తనాలను వేస్తున్న రైతులు

విశాలాంధ్ర-ఎచ్చెర్ల : మండలం ప్రకృతి వ్యవసాయ విభాగంలో భాగంగా ప్రకృతి వ్యవసాయ విభాగంలో పనిచేస్తున్న శోభన్ కొత్తపేట గ్రామంలో తన సొంత పొలం లో వరి విత్తనాలను లైన్ పద్ధతిలో వేసుకున్నారు. దేశీవాలి వెరైటీ నవరా విత్తనాలను వేసుకున్నారు. ఈ విధంగా వేసుకోవడం వలన విత్తనాలు మోతాదు తగ్గుతుందని, అలాగే పంటకు పురుగులు తెగుళు రాకుండా దిగుబడి పెరుగుతుందన్నారు. ప్రకృతి వ్యవసాయ పద్ధతుల్లో పంటలు సాగు చేయడం వలన పంట పెట్టుబడులు తగ్గుతాయన్నారు. ఈ కార్యక్రమం లో యన్.యఫ్ శ్రీనివాస్ మరియు వెంకటరమణ, ప్రసాద్ పాల్గొన్నారు.

పోర్టు నిర్వాసితుల సమస్యలు సీఎం దృష్టికి తీసుకువెళ్తా

టెక్కలి నియోజకవర్గం వైకాపా ఇన్చార్జ్ దువ్వాడ వాణి శ్రీనివాస్

విశాలాంధ్ర-సంతబొమ్మాళి : ఈమండలం మూలపేట గ్రీన్ ఫీల్డ్ పోర్టు నిర్వాసితుల సమస్యలను రాష్ట్ర ముఖ్యమంత్రి వైయస్ జగన్మోహన్ రెడ్డి దృష్టికి తీసుకువెళ్లి పరిష్కరించే విధంగా ప్రయత్నం చేస్తానని టెక్కలి నియోజకవర్గము వైకాపా ఇంచార్జ్ దువ్వాడ వాణి శ్రీనివాస్ అన్నారు. సోమవారం జిల్లా కలెక్టర్ శ్రీకేస్ లాటకర్, జిల్లా సూపరింటెంట్ ఆఫ్ పోలీస్ రాధిక, ఎమ్మెల్సీ దువ్వాడ శ్రీనివాస రావులు మూలపేటలో నిర్వాసితులతో సమావేశం ఏర్పాటు చేశారు. ఈసందర్భంగా ఆమె మాట్లాడుతూ నిర్వాసితుల సమస్యలు అన్ని విన్నానని, అలాగే ఆర్ అండ్ ఆర్ కాలనీ విషయంలో పూర్తిగా అధ్యయనం చేసి సమస్య పరిష్కరించి దిశగా ముందుకు తీసుకు వెళ్తామని అన్నారు. అభివృద్ధి పనులకు ఆటంకం లేకుండా చూడాలని కోరారు. ఈసందర్భంగా నిర్వాసితులు మాట్లాడుతూ కొంతమంది రైతులు భూములకు సంబంధించిన పిడిఎఫ్ ఇంతవరకు ఇవ్వలేదని, అలాగే స్థానిక నిరుద్యోగులకు ఉపాధి కల్పించలేదని వారు అధికారులు నాయకులు దృష్టికి తీసుకువెళ్లారు. ఈసందర్భంగా కలెక్టర్ ఎస్పీ మాట్లాడుతూ, మీ సమస్యలు ప్రభుత్వం దృష్టికి తీసుకువెళ్లి, ఉన్నతాధికారులకు తెలియజేసి పరిష్కరించే ప్రయత్నం చేస్తామని అన్నారు. ఈ కార్యక్రమంలో స్థానిక సర్పంచ్ జీరు బాబురావు అధికారులు నిర్వాసితులు వైకాపా నాయకులు పాల్గొన్నారు.

రైతులకు మాటిచ్చారు... నెల రోజుల్లో నెరవేర్చారు

అన్నదాతకు అండగా నిలిచిన యువ నేత డాక్టర్ ధర్మాన కృష్ణ చైతన్య

విశాలాంధ్ర-జలుమూరు : బాబు.. మేము ఏరు ప్రక్కనే ఉన్నాం.. కానీ... నీరు కోసం ఇబ్బందులు పడుతున్నాం... ఎన్నో సంవత్సరాలుగా పర్లాం 19 ఎల్.ఎమ్.సి. కాలువ పూడికతో కప్పబడి ఎగువ ప్రాంతానికి పూర్తిగా సాగునీరు అందడం లేదు... సుమారు 5 వేల150 ఎకరాల ఆయకట్టు పరిధి రైతులు నీటి ఇక్కట్లు పడుతున్నాం. మా ఊళ్ళకు మీరు ఏమిచ్చినా... ఇవ్వకపోయినా... మాకు కాలువ బాగుచేసి నీరందించండని మూడు గ్రామాల రైతులందరు ముక్త కంఠంతో జగనన్న సురక్ష కార్యక్రమంలో యువ నాయకులు డాక్టర్ ధర్మాన కృష్ణ చైతన్యను వేడుకున్నారు. యువ నేత స్పందించి కాలువ బాగుచేసే బాధ్యత తీసుకున్నారు. ఎమ్మెల్యే ధర్మాన కృష్ణదాస్ ప్రతిపాదనతో కలెక్టర్ నుండి రూ. 45 వేలు మంజూరు చేయించారు. ఈ నిధులతో కాలువ పూర్తి స్థాయిలో బాగు చేయడం జరిగే పని కాదని చెప్పి... రైతులకు ఇచ్చిన మాట నెరవేర్చడం ముఖ్యమని భావించి తన సొంత డబ్బులు రూ.50 వేలు ఇచ్చి కాలువ బాగుచేసే పనికి శ్రీకారం చుట్టారు. సోమవారం కాలువ వద్దకు వెళ్ళి తాను ఇస్తామన్న డబ్బులు 50 వేల రూపాయలు రైతుల చేతులకు అందజేసి జేసీబీతో కాలువ పనులను ప్రారంభించారు. యువ నేత రైతన్నల కష్టాలు తీర్చడంలో తీసుకున్న చొరవ పట్ల... సొంత డబ్బులు ఖర్చు చేసి మరీ ఔదార్యం చాటాడం పట్ల రైతులు హర్షాతిరేకాలు తెలుపుతున్నారు. కాలువ పనులు ప్రారంభ కార్యక్రమంలో ఎంపీపీ వాన గోపి, వైస్ ఎంపీపీ తంగి మురళీ కృష్ణ, మండల పార్టీ అధ్యక్షుడు కనుసు సీతారాం, జెసీఎస్ అధ్యక్షులు ధర్మాన జగన్, సర్పంచ్ తాడేల త్రినాధరావు, ఎంపీటీసీ వెలమల అసిరినాయుడు, సర్పంచ్ శ్యామ్ తదితరులు పాల్గొన్నారు.

జాతీయ ఉత్తమ ఉపాధ్యాయ అవార్డు గ్రహీత పారశెల్లి రామరాజు

విశాలాంధ్ర-పాతపట్నం : అరసవిల్లి గ్రామంలో జాతీయ ఉత్తమ ఉపాధ్యాయ అవార్డు గ్రహీతల సంఘం అధ్యక్షులు చౌదరి రాధాకృష్ణ అధ్యక్షతన జరిగిన జాతీయ ఉత్తమ ఉపాధ్యాయ అవార్డు గ్రహీతల సంఘం వార్షిక సమావేశం జరిగింది. పాతపట్నంకు చెందిన జాతీయ ఉత్తమ ఉపాధ్యాయ అవార్డు గ్రహీత పారశెల్లి రామరాజు ను జాతీయ ఉత్తమ ఉపాధ్యాయ అవార్డు గ్రహీతల సంఘం జాతీయ(ఆల్ ఇండియా) కార్యవర్గంలో కార్యదర్శిగా ఎన్నుకోవడం జరిగింది. ఈ కార్యవర్గంలో అధ్యక్షులుగా చౌదరి రాధాకృష్ణ, ఉపాధ్యక్షులుగా దూసి ఆంధ్ర స్టాలిన్, ప్రధాన కార్యదర్శిగా కొమ్మన పురుషోత్తం, కార్యదర్శిగా పారశెల్లి రామరాజు, కోశాధికారిగా కొప్పల సూర్యనారాయణలను ఎన్నుకున్నారు. ఈ సందర్భంగా కార్యదర్శి రామరాజు మాట్లాడుతూ సంఘ పటిష్టతకు, సంఘ పురోగతికి కృషి చేస్తానని హామీ ఇస్తూ సంఘానికి కృతజ్ఞతలు తెలియజేశారు. రామరాజు ఎంపిక పట్ల పలువురు హర్షం వ్యక్తం చేశారు. ఈకార్యక్రమంలో సిహెచ్. రాధాకృష్ణ, డి.ఎ.స్టాలిన్,కె. పురుషోత్తం, కే. సూర్యనారాయణ, వి.మల్లయ్య, ఏ దూళికేశ్వర రావు, పి.గణపతి రావు, ఏ.మధు బాబు, ఎం. నాగేశ్వరరావు, యు.సూర్యనారాయణ, కె.త్రినాధ రావు, వి.వి.ఎస్.ప్రసాద్, కే.తిరుమలరావు తదితరులు పాల్గొన్నారు.

జనసేనకు నీరాజనం పడుతున్న ప్రజలు

జనసేన నాయకులు కోరాడ విశ్వేశ్వరరావు

విశాలాంధ్ర-శ్రీకాకుళం రూరల్: స్వచ్ఛమైన సుపాలన సాగించేందుకు జనసేన పార్టీ ముందుకు వచ్చిందని ప్రజలు జనసేనకు రాష్ట్ర వ్యాప్తంగా నీరాజనాలు పడుతున్నారని, జనసేన పార్టీ శ్రీకాకుళం నియోజకవర్గ ఇన్చార్జ్ కోరాడ సర్వేశ్వరరావు అన్నారు. ఆదివారం రాత్రి శ్రీకాకుళం రూరల్ మండలం పొన్నాం పంచాయతీ నవనంపాడు గ్రామంలో జనసేన రూరల్ మండల అధ్యక్షుడు తాత్రాజుల కుర్మారావు ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన జనసేన విజయభేరీ సదస్సులో ఆయన మాట్లాడుతూ... వైసీపీ ప్రభుత్వం రాష్ట్రాన్ని నిట్టనిలువునా దోచుకుటుందని, ప్రభుత్వ ఆస్తులు అడ్డుగోలుగా ప్రజాప్రతినిధులు దోచుకునే పరిస్థితి ఏర్పడిందని ఆయన ఆరోపించారు. జనసేన పార్టీ అధికారంలోకి వస్తే రాష్ట్ర దిశ దశ మార్చుతుందని ఆయన హామీ ఇచ్చారు. రాష్ట్ర సర్వతోముఖాభివృద్ధికి జనసేన అధికారంలోకి రావడం శరణ్యమని అన్నారు. శ్రీకాకుళం జిల్లాలో సహజ వనరులను వైసీపీ నేతలు బహిరంగంగా దోచుకుంటున్నారని ఆరోపించారు. ఎన్నికల కమిషన్ వారి ఆదేశాల మేరకు నిష్పక్షపాతంగా ఓటర్ల జాబితాలు తయారు చేయాలని ఇందులో అధికార పార్టీ ఒత్తుడులకు లొంగకూడదని ఆయన కలెక్టర్ కు విజ్ఞప్తి చేశారు. శ్రీకాకుళం రూరల్, గార, శ్రీకాకుళం అర్బన్ ప్రాంతాల్లో జనసేన పార్టీకు ప్రజలు బ్రమ్మరథం పడుతున్నారని సర్వేశ్వరరావు అన్నారు. ఈ సదస్సులో శ్రీకాకుళం జిల్లా జనసేన నేతలు ప్రజలు, పార్టీ అభిమానులు పెద్దఎత్తున హాజరయ్యారు. ఈ కార్యక్రమంలో పాల్గొని మన పార్టీ విజయానికి ప్రతి చిన్నపెద్ద తేడాలేకుండా కృషి చేస్తే విజయభేరి మనం సాధించగలమన్నారు. ఈ కార్యక్రమంలో జనసేన నాయకులు నిమ్మడ వెంకటేష్, ఊట మల్లేశ్వరరావు, వర, బమ్మిడి సిద్దు, పెద్దపాడు శంకర్, రమేష్, రామకృష్ణ, రాంబాబు, చిట్టి భాస్కర్, ముంగు జగదీష్ తదితరులు కార్యకర్తలు పాల్గొన్నారు.

పేరుకే రాష్ట్ర అధ్యక్షులు... ఒక్క వార్డు మెంబరు కూడా గెలుచుకోలేకపోయారు

అచ్చెన్నాయుడుకు దువ్వాడ వాణి కౌంటర్

విశాలాంధ్ర-టెక్కలి : రాష్ట్ర అధ్యక్షుల మంటారు ఒక వార్డ్ మెంబర్ కూడా గెలుచుకోలేకపోయారని తెలుగుదేశం పార్టీ రాష్ట్ర అధ్యక్షుడు కింజరాపు అచ్చెన్నాయుడు కి టెక్కలి నియోజకవర్గం ఇన్‌చార్జ్ ఎమ్మెల్యే అభ్యర్థి దువ్వాడ వాణి ఎద్దేవా చేశారు. స్థానిక పార్టీ కార్యాలయంలో సోమవారం విలేకర్ల సమావేశంలో మాట్లాడుతూ టెక్కలి నియోజకవర్గం లో జరిగిన వార్డ్ మరియు పంచాయతీ ఉప ఎన్నికలలో క్లీన్ షిప్ చేశామని టెక్కలి మండలం నర్సంపల్లి పంచాయతీలో వార్డ్ మెంబర్ ఎలక్షన్‌లో బారీ మెజార్టీతో గెలుపొందారని బోరుభద్ర వార్డు 23కి వాయిదా వేశారని అది కూడా మంచి మెజార్టీతో గెలుపొంది తీరుతామని నందిగామ మండలం అన్నపురం సర్పంచ్ చనిపోవడంతో ఇనామినస్ ఇవ్వాలి కానీ తెలుగుదేశం పార్టీ పోటీ పడుతుందని ఎక్కడైనా అధికారంలో ఉన్న వ్యక్తి చనిపోతే వాళ్ల కుటుంబానికి ఇనాంనెస్ గా ఇచ్చేస్తారని ఇక్కడ కూడా తెలుగుదేశం పోటీ పడడం వాళ్ల విజ్ఞతకే వదిలేస్తున్నామని రాష్ట్ర అధ్యక్షులు మంటారు ఒక వార్డ్ మెంబర్ కూడా గెలిపించలేకపోయారని మా కుటుంబం అన్ని సంవత్సరాలు రాజకీయం చేశారు అని చెప్పుకునే నాయకులు ఈరోజు వార్డు మెంబర్ కూడా గెలుపు పొందలేకపోయారని అన్నారు. గత ఎన్నికలలో గర్వంగా చెప్పగలమని 136 పంచాయతీలకు 90 గెలుపొందారని జడ్పిటిసిలు నాలుగు మండలాల్లో గెలుపొందామని, ఎంపీపీ లు నాలుగు మండలాల్లో కైవసం చేసుకున్నామని ఉప ఎన్నికల్లో మంచి ఫలితాలు సాధించామని రాబోయే సార్వత్రిక ఎన్నికలలో ప్రజలు ఎంత చక్కగా జగన్మోహన్ రెడ్డి పాలనను స్వాగతిస్తున్నారు అన్నది ఇప్పుడు వచ్చే ఫలితాలే అర్థమవుతుందని గడపగడపకు కార్యక్రమంలో ప్రజల కళ్ళలో ఆనందం చూస్తున్నామని భారతదేశంలో డెవలప్ స్టేట్లో ఆంధ్రప్రదేశ్ ఐదో స్థానంలో ఉందని, ఆంధ్రప్రదేశ్ రాష్ట్రంలో 70 శాతం సంక్షేమ పథకాలు మహిళలకు అందువడం జరిగిందని, తెలుగుదేశం ఉండేటప్పుడు ఆంధ్రప్రదేశ్లో 168 రుణభారం ఉండేదని నేడు ముఖ్యమంత్రి జగన్మోహన్ రెడ్డి పరిపాలనలో కోవిడ్ సమయంలో కూడా రుణభారం 50% కి తగ్గిందనిఅన్నారు. రాష్ట్రంలో ఎన్నడూ లేని విధంగా 15 మెడికల్ కాలేజీలు తేవడం జరిగిందని ఇంటింటి వైద్యం ఇవ్వడం జరుగుతుందని, నాడు నేడు ద్వారా కార్పొరేట్ స్కూల్ కు దీటుగా ప్రభుత్వ పాఠశాలలు చేయడం జరిగిందని, పిల్లలకి ఇంగ్లీష్ మీడియం విద్యాబోధన అందిస్తూ స్కూల్ యూనిఫామ్స్, షూస్, బ్యాగ్స్ ప్రభుత్వమే ఖర్చు భరిస్తూ పిల్లల చదువుకు ముఖ్యమంత్రి జగన్మోహన్ రెడ్డి పెద్దపేట వేశారని, వాలంటరీ సచివాలయ వ్యవస్థ ద్వారా పథకాల కోసం గత ప్రభుత్వాలా రాజకీయ నాయకులు చుట్టూ తిరగకుండా ఇంటి వద్దకే పథకాలు వచ్చే విధంగా వాలంటరీ వ్యవస్థ పని చేస్తుందని, ప్రజలు ముఖ్యమంత్రి జగన్మోహన్ రెడ్డి పాలనను మళ్లీ కోరుకుంటున్నారని మేము గడపగడపకు వెళ్లే కార్యక్రమంలో ప్రతి ఒక్కరికి పథకాలు అందుతున్నాయని మళ్లీ రాష్ట్రంలో 175 స్థానాలు గెలుపొంది అధికారం చేపడతామని తెలిపారు.

ఎస్ఎస్‌సీ జీడీ ఫలితాలలో 'శ్రీఆకాశ కెరియర్స్' విద్యార్థుల జయకేతనం




విశాలాంధ్ర-అరసవల్లి : ఎస్ఎస్‌సి, జీడీ ఫలితాలలో శ్రీఆకాష్ కెరియర్ విద్యార్థులకు ఉద్యోగాలు వచ్చాయని డైరెక్టర్ వెంకట్ అన్నారు. ఆయన కార్యాలయంలో ఏర్పాటు చేసిన పత్రికా విలేకరుల సమావేశంలో సంస్థ డైరెక్టర్ సిహెచ్ వెంకట్ మాట్లాడుతూ తమ సంస్థ నుంచి ఇద్దరు విద్యార్థులు ఆర్.శరత్‌బాబు (హాల్ టికెట్ నెంబర్(80120334), ఆర్. దుర్గాప్రసాద్ (హాల్ టికెట్ నెంబర్ (809008965) విద్యార్థులు ఉద్యోగాలు సాధించి నట్లు తెలిపారు. విద్యార్థులను సంస్థ డైరెక్టర్, అధ్యాపకులు అభినందిస్తూ శుభాకాంక్షలు తెలియజేశారు. ఈ సందర్భంగా వెంకట్ మాట్లాడుతూ తమ సంస్థ నుంచి క్రమం తప్పకుండా మొన్న అగ్నివీర్ నేవీ కి కె. వెంకటేష్ ఉద్యోగం సాధించగా ఇప్పుడు ఇద్దరూ సాధించినట్లు దానికి చాలా సంతోషంగా ఉన్నట్టు తెలిపారు. ఇదే క్రమాన్ని ఆనవాయితీగా చేసుకుని ముందు కూడా మరింత మంది విద్యార్థులను ఉద్యోగులుగా తీర్చిదిద్దడానికి కట్టుబడి ఉన్నట్లు తెలియజేశారు.

తక్షణం సమస్యలు పరిష్కరించాలి

విశాలాంధ్ర-ఇచ్ఛాపురం : కార్మికుల పట్ల చిత్తశుద్ధితో వ్యవహరించి ఇచ్చిన హామీలు తక్షణం నెరవేర్చే చర్యలు చేపట్టాలని సి.ఐ.టి.యు డిమాండ్ చేసింది. మున్సిపల్ పారిశుధ్య ఇంజనీరింగ్ కార్మికుల సమస్యల పరిష్కార సాధనకు నిర్వహించబోయే చలో విజయవాడ కార్యక్రమం నేపథ్యంతో సోమవారం పట్టణంలో మున్సిపల్ కార్మికులు సి.ఐ.టి.యు ఆధ్వర్యంలో బైక్ ర్యాలీ నిర్వహించి తమ డిమాండ్లను తక్షణం పరిష్కరించాలని కోరారు. సి.ఐ.టి.యు మండల కన్వీనర్ రమేష్ పట్నాయిక్ ఆధ్వర్యంలో పాత బస్టాండ్ కూడలి నుండి మార్కెట్ జంక్షన్, దాసన్నపేట జంక్షన్, రథంవీధి, ఆసుపత్రి రోడ్డుల మీదుగా ర్యాలీ నిర్వహించారు. సమాన పనికి సమాన వేతనం ఇవ్వాలని, ఆప్కోస్ వద్దని, అధికారంలోకి వస్తే కార్మికులను రెగ్యులర్ చేస్తామన్న హామీని నిలబెట్టుకోవాలని, ఇంజనీరింగ్ కార్మికులకు రిస్క్ హెల్త్ అలవెన్సు సమస్యలు పరిష్కరించని పక్షంలో ఉద్యమం ఉధృతం చేస్తామని అన్నారు. చలో విజయవాడ విజయవంతం చేయాలని కోరారు.

కులధృవీకరణ సర్టిఫికేట్‌లు అందించండి

విశాలాంధ్ర-శ్రీకాకుళం టౌన్: నా కులధృవీకరణ సర్టిఫికేట్‌ను ఇప్పించాలని కలెక్టరేట్ దరి కొత్తపేట గ్రామానికి చెందిన సతివాడ నవీన్‌కుమార్ సోమవారం స్పందనలో ఫిర్యాదు చేశారు. మా తల్లిదండ్రులు కులాంతర వివాహం చేసుకున్నారు. నా తండ్రి ఎస్సీ కులం, తల్లి బీసీ కులానికి చెందిన వారని, నా తండ్రి సంరక్షణలో ఉంటూ చదువుకొని ఉన్నానని, మా తండ్రి వారసత్వంగా నా వన్నీ చదువుకునే సర్టిఫికేట్‌లలో ఎస్సీ కులంగా ఉన్నప్పటికీ దానికి వీఆర్‌వో, నాకు ఎస్సీ కుల ధృవీకరణ సర్టిఫికేట్ ఇచ్చేందుకు పలుదఫాలుగా తిప్పుతున్నారని, గతంలో ప్రభుత్వం వారే ఇచ్చిన ఎస్సీ సర్టిఫికేట్ కూడా ఉందని, దీనిపై స్పందించి నా ఉన్నత విద్యాఅవసరార్థం నాకు ఎస్సీ ధృవీకరణ సర్టిఫికేట్ ఇప్పించాలని స్పందనలో నవీన్‌కుమార్ స్పందనలో వినతి పత్రం ఇచ్చారు.

హరితవనంగా ఆర్ట్స్ కళాశాల

విశాలాంధ్ర -శ్రీకాకుళం -శ్రీకాకుళం స్పోర్ట్స్/క్రైం: పర్యావరణ పరిరక్షణకు వాకర్స్ ఇంటర్నేషనల్ సంస్థలు అత్యంత ప్రాధాన్యత ఇస్తున్నాయని, వ్యక్తిగత ఆరోగ్యంతో పాటు సమాజంలో నివసించే అందరి ఆరోగ్యం పరిరక్షించేందుకు వాకర్స్ సంస్థలు ప్రత్యేక చర్యలు తీసికుంటున్నాయని వాకర్స్ ఇంటర్నేషనల్ మాజీ గవర్నర్ పి.జి.గుప్తా అన్నారు. సోమవారం నగరంలో ఆర్ట్స్ కళాశాల ఆవరణలో పుట్టపర్తి సత్యసాయిబాబా సన్నిధానం నుంచి తెచ్చిన మొక్కలు నాటారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ... హరిత వనంగా ప్రభుత్వ డిగ్రీ కళాశాల ఆవరణాన్ని తయారుచేయుటకు స్టార్ వాకర్స్ క్లబ్ ముందుకు రావటం ఎంతో అభినందనీయం అన్నారు. సత్యసాయిబాబా భక్తుడు జామి జనార్ధనరావు తీసుకువచ్చిన మేలుజాతి మొక్కలు నాటడం ఎంతో ఆనందంగా వుందన్నారు. ప్రత్యక్ష దైవం గా భావించే బాబా సన్నిధానం నుండి శ్రీకాకుళం నగరానికి సుమారు 30వేల మొక్కలు వచ్చాయని వీటిని జిల్లా వ్యాప్తంగా అన్ని గ్రామాల్లో నాటుతున్నామని సాయి సేవకులు నల్లబాటి కృష్ణమూర్తి, డాక్టర్ కె. పాండురంగారావు లు అన్నారు. ఈ కార్యక్రమంలో వాకర్స్ ప్రతినిధులు ఎస్.జోగినాయుడు, బి.వి.రవిశంకర్, జి.ఇందిరాప్రసాద్, గుడ్ల సత్యనారాయణ, సింహాద్రి వేణుగోపాల్, బి.దేవీప్రసాద్, నాగేశ్వర ఈశ్వరరావు, గోలీ సంతోష్, ఉమా, మల్లిబాబు, మోహన్, సంజీవరావు తదితరులు పాల్గొన్నారు.

వృద్ధులపట్ల ప్రేమ, ఆప్యాయత చూపాలి

విశాలాంధ్ర-శ్రీకాకుళం రూరల్: పండుటాకులను ప్రతీ ఒక్కరూ ఆదరించాలని, వారిని భారంగా భావించరాదని వాకర్స్ ఇంటర్నేషనల్ సంస్థలు మాజీ గవర్నర్లు ప్ జి.ఇందిరాప్రసాద్, గుడ్ల సత్యనారాయణ లు అన్నారు. సోమవారం ప్రపంచ వృద్ధుల దినోత్సవం సందర్భంగా నగరంలో ఖ్యాతి ఫౌండేషన్ ఆధ్వర్యంలో నడుస్తున్న వృద్ధాశ్రమంలో వృద్ధులకు పండ్లు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా సామాజిక వేత్తలు ఇందిరాప్రసాద్, బి.వి.రవిశంకర్ లు మాట్లాడుతూ వయోవృద్ధుల పోషణ, సంక్షేమ చట్టంపై విస్తృత స్థాయిలో అవగాహన కల్పించాలని సూచించారు. ఒంటరితనం కారణంగా అధికశాతం మంది వృద్ధులు తీవ్ర మానసిక ఇబ్బందులకు గురి అవుతున్నారని ఈ పరిస్థితి మంచిది కాదన్నారు. వృద్ధాప్యం మరో పసితనం లాంటిదని ప్రతీ ఒక్కరూ ఈ విషయాన్ని గ్రహించి మెలగాలని వారన్నారు. స్టార్ వాకర్స్ క్లబ్ అధ్యక్షుడు శాసపు జోగినాయుడు మాట్లాడుతూ.. వృద్ధాశ్రమాలు లేని సమాజ నిర్మాణానికి మనమంతా పాటుపడాలని కోరారు. దేశవ్యాప్తంగా వివిధ రంగాల్లో సేవలు అందించిన వృద్ధులకు ఈ రోజు సత్కరించటం, వారు సమాజానికి అందించే సేవలు మననం చేసికోవటం ఒక ప్రత్యేకత అని అన్నారు. ఈ కార్యక్రమంలో మాజీ గవర్నర్ గుడ్ల సత్యనారాయణ, వాకర్స్ ఇంటర్నేషనల్ ప్రతినిధులు బి.దేవీప్రసాద్, ఎం.సత్యనారాయణ, మీడియా ప్రతినిధులు, స్వచ్ఛంద సేవకులు పెద్దఎత్తున పాల్గొన్నారు.

గ్రామాల అభివృద్ధే లక్ష్యం : ఎంపీపీ నీలవేణి

విశాలాంధ్ర-వజ్రపుకొత్తూరు : వైసీపీ ప్రభుత్వం గ్రామాల సమగ్ర అభివృద్ధి లక్ష్యంగా పని చేస్తుందని ఎంపీపీ ఉప్పరపల్లి నీలవేణి అన్నారు. మండలం కొండవూరులో రూ. 12 లక్షల వ్యయంతో నిర్మించనున్న అంగన్వాడీ భవన నిర్మాణానికి, రూ. 2 లక్షలతో సిసి రోడ్డు పనులకు సోమవారం భూమిపూజ చేసారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ గ్రామాల్లో మౌలిక వసతుల కల్పనకు అధిక ప్రాధాన్యం ఇస్తున్నట్లు చెప్పారు. వైసీపీ ప్రభుత్వం సంక్షేమంతో పాటు అభివృద్ధికి పెద్దపీట వేస్తుంది అన్నారు. జగనన్న పాలనలో అన్ని వర్గాలకు మేలు జరుగుతుంది అన్నారు. మరింత సమగ్ర అభివృద్ధికి జగనన్నకు మరోసారి అవకాశం ఇవ్వాలని కోరారు. సర్పంచ్ కొల్లి భాస్కరరావు ఆధ్వర్యంలో జరిగిన కార్యక్రమంలో కాశీబుగ్గ ఐసిడిఎస్ ప్రాజెక్టు పిఓ. డి. శార్వాణి, జడ్ పి వైస్ చైర్ పర్సన్ ప్రతినిధి పాలిన శ్రీనివాస్, మండల ప్రత్యేక ఆహ్వానితులు ఉప్పరపల్లి ఉదయ్ కుమార్, మాజీ ఎంపీటీసి ఇప్పిలి అప్పన్న, ఉప సర్పంచ్ లండ ఆనందరావు, కొరికాన వాసు, బూత్ కన్వీనర్ లండ సూర్యనారాయణ, యడ్ల శ్రీనివాసరావు, దట్టి నాగేశ్వరరావు, కోనారి సింహాచలం, కోనారి లలిత, కొరికాన అప్పారావు, కర్రి పాపారావు, ఇప్పిలి శ్రీను, అంగన్వాడీ కార్యకర్త మౌనిక తదితరులు పాల్గొన్నారు.

అపారిశుద్ధ్య నిర్మూలనకు కృషి : మున్సిపల్ చైర్మన్ గిరిబాబు

విశాలాంధ్ర-పలాస : పలాస కాశీబుగ్గ మున్సిపాలిటీ పరిధిలో అపారిశుద్ధ్యం నిర్మూలనకు కృషి చేస్తున్నామని, దీనికి ప్రజల సహకారం అవసరమని మున్సిపల్ చైర్మన్ బల్ల గిరిబాబు అన్నారు. సోమవారం నూతనంగా కొనుగోలు చేసిన చెత్తసేకరణ వాహనాన్ని కమిషనర్ టి.నాగేంద్రబాబుతో కలిసి పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మున్సిపాలిటీలో అపారిశుద్ధ్యం పేరుకుపోవడం వాస్తవమని, దీంతో పాటు పారిశుద్ధ్య కార్మికుల కొరత కూడా ఉందన్నారు. అపారిశుద్ధ్యం నిర్మూలనకు తనవంతు కృషి చేస్తున్నానన్నారు. జంట పట్టణాల్లో ప్రజలు చెత్తాచెదారంను కాలువల్లో వేయడం వలన అపరిశుభ్రంగా తయారవుతుందని, దీనిని నిర్మూలించాలని కోరారు. కార్యక్రమంలో మున్సిపల్ సిబ్బంది పాల్గొన్నారు.

చిరంజీవి యువత ఆధ్వర్యంలో వైద్య శిబిరం

విశాలాంధ్ర-శ్రీకాకుళం టౌన్: మెగా స్టార్ చిరంజీవి జన్మదినోత్సవాన్ని పురస్కరించుకుని శ్రీకాకుళం జిల్లా చిరంజీవి యువత ఆధ్వర్యంలో సేవా కార్యక్రమాలు వరుసగా కొనసాగుతున్నాయి. వారం రోజుల పాటు షెడ్యూల్ ప్రకారం సామాజిక సేవా కార్యక్రమాలను నిర్వహిస్తున్నారు. అందులో భాగంగా సోమవారం నగరంలోని మొండేటివీధిలోని షిర్డిసాయి ఆలయ ప్రాంగణంలో ఉచిత వైద్య శిబిరాన్ని నిర్వహించారు. అఖిల భారత చిరంజీవి యువత వర్కింగ్ ప్రెసిడెంట్ తైక్వాండో శ్రీను సారధ్యంలో ఈ శిబిరాన్ని ఏర్పాటు చేశారు. ఈ శిబిరాన్ని సీనియర్ జర్నలిస్ట్ సుధీర్ వర్మ, వ్యాపారవేత్త బలభద్రుని రాజా, షేక్ అబ్దుల్లా, బాలకృష్ణలు కలసి ప్రారంభించారు. ఈ శిబిరంలో రాగోలు జెమ్స్ ఆసుపత్రి వైద్యులు సిబ్బంది పాల్గొని రోగులను పరీక్షించారు. అదేవిధంగా పాలకొండ రోడ్డులోని కృష్ణాపార్క్ వద్ద గల వి డెంటల్ దంత వైద్యశాల సిబ్బంది కూడా వైద్య పరీక్షలను నిర్వహించారు. సాదారణ ఓపి సేవలు పొందిన వారితో పాటు దంత వైద్య సేవలు పొందిన వారికి అతిథుల చేతుల మీదుగా ఉచితంగా మందులను పంపిణీ చేశారు. బి.పి, షుగర్, ఈసీజి వంటి పరీక్షలన్నింటిని కూడా వైద్య శిబిరం వద్దనే ఉచితంగా చేశారు. ఈ కార్యక్రమంలో టీం రామ్ చరణ యువత శ్రీకాకుళం జిల్లా ప్రతినిధులు లింగాల హరీష్, గౌతమ్, సిద్ధు, చల్లా అంబేద్కర్, హేమంత్, జిల్లా పవన్ కళ్యాణ్ అధ్యక్షులు కిరణ్ కిర్రు, పెయ్యల చంటి, కిరణ్ రెడ్డి, ఆలిండియా అల్లు అర్జున్ ఫ్యాన్స్ వెల్ఫేర్ అసోసియేషన్ శ్రీకాకుళం జిల్లా అధ్యక్షుడు పుక్కల నవీన్, బాను, గిరి, సిక్కోలు అబ్బాయి బన్నీ,రమణారెడ్డి, పవన్ రాయల్, సాయిధరమ్ తేజ్ యువత అధ్యక్షుడు జోగిపాటి వంశీ, కిరణ్, వరుణ్ తేజ్ ఫ్యాన్స్ అధ్యక్షుడు శీర రాజు తదితరులు పాల్గొన్నారు.

ఆర్థికంగా అభివృద్ధి చెందాలి : ఎమ్మెల్యే రెడ్డి శాంతి

విశాలాంధ్ర-మెళియాపుట్టి: ప్రతి ఒక్కరూ ఆర్థికంగా అభివృద్ధి చెందాలని ఎమ్మెల్యే రెడ్డి శాంతి అన్నారు. మండల కేంద్రంలో స్థానిక వెలుగు కార్యాలయంలో వందన వికాస కేంద్రాన్ని ఎమ్మెల్యే రెడ్డి శాంతి సోమవారం ప్రారంభించారు. కేంద్ర ప్రభుత్వం గిరిజన రైతులు పండించే పంటలను గిట్టుబాటు ధరను కల్పించే దిశగా జీడి, అగర్బత్తి, చిరుధాన్యాల ప్రాసెస్సింగ్ యూనిట్ లను ప్రవేశపెట్టిందని తెలియజేస్తూనే దీంట్లో భాగంగానే అంపురం, ఎఫ్పీఓ మెళియాపుట్టి లలో జీడి ప్రాసెసింగ్ యూనిట్ కై సుమారు 15 లక్షల నిధులతో ఏర్పాటు చేసిన వాటిని ప్రారంభించడం సంతోషకరంగా ఉందంటూనే గిరిజన ప్రజల పండించే పంటతో పదిమందికి ఉపాధి దొరకడంతో పాటు ఆర్థికంగా చేయూతనిస్తుందన్నారు. అనంతరం ఎమ్మెల్యే వందన వికాస కేంద్రాన్ని పరిశీలించడంతో పాటు వివరాలు అడిగి తెలుసుకున్నారు. ఈ ప్రారంభోత్సవంలో ఎమ్మెల్యేతో పాటు ఏపీడి ఆర్ వి రమణ, ఏపీఎం లలిత, ప్రజా ప్రతినిధులు, అధికారులు, సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

బూత్ కన్వీనర్లు బాధ్యతగా వ్యవహరించండి : మాజీ ఎమ్మెల్యే రమణమూర్తి

బూత్ కన్వీనర్లు బాధ్య తగా వ్యవహరించాలని నరసన్నపేట మాజీ ఎమ్మెల్యే రమణమూర్తి అన్నారు. ఆయన మాట్లాడుతూ గ్రామ పోలింగ్ స్టేషన్ పరిధిలో పార్టీ ప్రతినిధులు, బూతులెవల్ ఏజెంట్లు గ్రామస్తులతో అధికారులు ప్రతి పోలింగ్ కేంద్రం వద్ద ఎనిమిది గంటలకు పాల్గొవాలన్నారు. ఇంటింటా చేసిన సర్వే, ఓటర్ నమోదు, చేర్పులు మార్పు లపై వివరాలు వారికి చదివి తెలియజేయాలని సూచించారు. ఓటరు లిస్టులో ఎటువంటి అభ్యంతరాలు ఉన్నాయో లేవో తెలుసుకోవాలన్నారు. ఈ వివరాలన్నీ పార్టీ కార్యాలయంలో రిజిస్టర్ నందు నమోదు చేసుకోవాలని మాజీ ఎమ్మెల్యే రమణమూర్తి కోరారు.

మీ ఓటు భద్రమేనా...?

- ఆన్లైన్లో చెక్ చేసుకోండి..
- విలువైన ఓటును కాపాడుకోండి

విశాలాంధ్ర-కోటబొమ్మాళి : ప్రజాస్వామ్యంలో ఓటు హక్కును వజ్రాయుధంతో పోలుస్తారు. ఎన్నికలలో పాలకులను ఎంచుకున్నందుకు భారత రాజ్యాంగ కల్పించిన అమూల్యమైన హక్కు ఓటు విలువలను పాటించే వారిని ఎన్నుకుంటే భవిష్యత్తు బాగుంటుంది. సమాజానికి మేలు జరుగుతుంది. పొరపాటు చేస్తే దిద్దుకునేలోగా భారీ నష్టం జరుగుతుంది. అమూల్యమైన ఓటు హక్కును వినియోగించుకోవడమే కాదు.. మారిన రాజకీయ పరిణామాలతో ఓటు హక్కును కాపాడుకోవడం కూడా అవసరంగా మారింది. ఓటర్లు నిర్లక్ష్యంగా ఉంటే జాబితా నుంచి పేరు గల్లంతవుతుంది. తాజాగా ఓటర్ జాబితా వెరిఫికేషన్ కోసం ఎన్నికల కమిషన్ ఏర్పాటు చేసిన సిబ్బంది ఇంటింటికి వస్తున్నారు. ఓటర్ లిస్టులో జాబితాలో పేరు ఉందో లేదో తప్పనిసరిగా తెలుసుకోవాలి. నకిలీలను జాబితాలో చేర్పించడం లాంటి ఘటనలు వెలుగు లోకి వస్తున్నాయి. కాబట్టి ఓటర్లు అప్రమత్తంగా ఉండాలి. ప్రజల చేతుల్లో ఉన్న ఏకైక బలమైన ఆయుధం ఓటు మాత్రమే. ఐదు సంవత్సరాలకు ఒకసారి వినియోగించుకునే ఓటును పదిలంగా కాపాడుకోవడంతో ఎంతో అవసరం, ఇప్పటికే సచివాల సిబ్బంది ఓటర్ల జాబితా నమూనాతో పరిశీలన మొదలుపెట్టారు. కోటబొమ్మాళి మండలంలో అన్ని సచివాలయాల పరిధిలో ఓటర్ల జాబితా సవరణ జరుగుతుంది. తమ ఓటు హక్కు ఉందా తీసేసారా, ఉన్న తప్పులు ఉన్నాయా మీ ఇంటి నెంబర్తో ఎవరైనా ఓటు నమోదు చేసుకున్నారా, మీ ఇంటికి సర్వే కోసం వచ్చిన బిఎల్వో అనే అడిగి తెలుసుకోవాలి, లేదా ఆన్లైన్లో చెక్ చేసుకోవాలి. ఓటర్ జాబితాలో పేరు లేకుంటే ఐదు పద్ధతులలో దరఖాస్తు చేసుకోవచ్చు. బూతు స్థాయి అధికారి బిఎల్ఎకు నేరుగా ఫామ్ -6 అందించవచ్చు, లేదా నియోజక వర్గం మండల స్థాయిలో ఎన్నికల సంఘం నియమించిన, ఈఆర్వో, ఏఈఆర్వో, తహసీల్దార్ కార్యాలయంలో దరఖాస్తు చేసుకోవచ్చు, బిఎల్ఓ మీ అడ్రస్ను పరిశీలించి ఓటర్ జాబితాలో పేరు చేరుస్తారు. మీ మొబైల్ లోని ప్లే స్టోర్ ద్వారా ఓటర్ హెల్ప్ లైన్ అనే యాప్ను డౌన్లోడ్ చేసుకొని ఫోన్ నెంబర్ వివరాలతో రిజిస్టర్ చేసుకుని లాగిన్ అవ్వాలి. ఓటర్ రిజిస్ట్రేషన్ విభాగంలోకి వెళ్లి న్యూ ఓటర్ రిజిస్ట్రేషన్ అనే దానిపై క్లిక్ చేసి వివరాలన్నీ నింపి దరఖాస్తు సబ్మిట్ చేయాలి. అలా కూడా ఓటు హక్కు కోసం దరఖాస్తు చేసుకోవచ్చు.

14, 15వ ఆర్థిక సంఘ నిధులు జమ చేయాలి

విశాలాంధ్ర-హిరమండలం: తక్షణమే సర్పంచ్ ల ఖాతాల్లో 14, 15వ ఆర్థిక సంఘనిధులు జమ చేయాలని టీడీపీ జడ్పీటీసీ పొగిరి బుచ్చి బాబు టీడీపీ కి చెందిన సర్పంచ్ లు దారపు ఢిల్లేశ్వర రావు, గండన శంకర్ రావు, మల్లిపురం రామారావు లు సభ లో ప్లకార్డ్ లతో నిరసన తెలిపారు. సోమవారం ఎంపీడీఓ కార్యాలయ సమావేశమందిరం లో ఎంపీపీ తూలుగు మేనక అధ్యక్షతన ఎంపీడీఓ బొడ్డేపల్లి శైలజ ఆధ్వర్యంలో సర్వ సభ్య సమావేశం నిర్వహించారు. సమావేశం జరుగుతుండగా జడ్పీటీసీ సభ్యులు టీడీపీ సర్పంచ్ లు ప్లకార్డ్ తో పంచాయతీ లకు 14,15 వ ఆర్థిక సంఘ నిధులు రాష్ట్ర వ్యాప్తంగా 8661 కోట్లు రూపాయలు రాష్ట్ర ప్రభుత్వం దొంగలించిందని, పంచాయతీ ల్లో వీధి బుల్బులు కూడా వేసుకోలేక పోతున్నామని వెంటనే నిధులు మంజూరు చేయాలని డిమాండ్ చేశారు. పంచాయతీ లకు వచ్చిన సొమ్ము తీసేస్తే అభివృద్ధి ఎలా చేయగలమని ఏకగ్రీవ పంచాయతీ లకు నిధులు కూడా రాలేదని ఆవేదన వ్యక్తం చేశారు. పార్టీ లకు అతీతంగా ప్రతీ సర్పంచ్ ఆందోళన చెయ్యాలని పిలుపు నిచ్చారు. హిరమండలం పెద్ద కోరాడ లో జ్వరాలు ఏమి లేవని ఒక ఇద్దరు కు నామమాత్రం జ్వరం వస్తే డెంగ్యూ జ్వరమని కొందరు భయబ్రాంతులు చేశారని అ వీధిలో సర్వే చేపట్టి, శానిటేషన్ కూడా చేపట్టి వైద్య శిబిరం నిర్వహించామని వైద్యాధికారి డా. సి హెచ్ సాయి గీత సభలో వెల్లడించారు. హిరమండలం ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో ఉపాధ్యాయులు కొరత ఎక్కువ గా ఉందని, భర్తీ చేయండి అని ఎంపీటీసీ తట్ల శంకర్ కోరారు. మండల ప్రత్యేక ఆహ్వానితులు తూలుగు తిరుపతి రావు మాస్టర్, ఎంపీడీఓ శైలజ, తహసీల్దార్ బి మురళి మోహన్.ఈఓ పి ఆర్డి ఎస్ వెంకటేశ్వరరావు, పి ఆర్ జె ఈ ఈ ఎస్ భాస్కర్ రావు, ఏం ఈఓ లు కిలారి రాంబాబు, టి షణ్ముఖ రావు, వైస్ ఎంపీపీ లు వి సావిత్రి, సవర వైకుంఠ రావు, ఎంపీటీసీ లు తట్ల శంకర్ రావు, బెవర గంగాధర్, కె ప్రియాంక, ఎస్ శ్రీదేవి, సి హెచ్ బుడ్డు, ఏ గురవమ్మ, ఎల్ సావిత్రి, సర్పంచ్ లు తదితరులు పాల్గొన్నారు.

ఉద్దానం మెడికల్ సెంటర్‌కు లక్ష రూపాయలు విరాళం

- అభివృద్ధి పథంలో సోంపేట
- రోటరీ సేవలపై ఎలక్ట్ గవర్నర్ వెంకటేశ్వరరావు హర్షం

విశాలాంధ్ర-సోంపేట : సోంపేట రోటరీక్లబ్ అధ్యక్షుడుగా దుద్ది శ్రీనివాసరావు పదవి బాధ్యతలు చేపట్టిన తక్కువ రోజుల్లో పెద్ద సంఖ్యలో అభివృద్ధి పనులతో పాటుగా పలు సేవా కార్యక్రమాలు చేపట్టడం గొప్ప విషయమని కొనియాడారు. ఈ మేరకు ఆదివారం రాత్రి సోంపేట రోటరీ క్లబ్‌లో రోటరీ అధ్యక్షుడు దుద్ది శ్రీనివాసరావు ఆధ్వర్యంలో నిర్వహించిన న్యూ నెంబర్ ఓరియెంటేషన్ సెమినార్‌లో రోటరీ ఎలక్ట్ గవర్నర్ డాక్టర్ ఎం.వెంకటేశ్వరరావు, అసిస్టెంట్ గవర్నర్ పి.దినేష్‌లు ముఖ్య అతిథులుగా పాల్గొని 30 మంది న్యూ మెంబర్స్‌ని రోటరీ అధ్యక్షుడు దుద్ది శ్రీను, సెక్రటరీ పీవీ కృష్ణ ఆధ్వర్యంలో డాక్టర్ ఎం.వెంకటేశ్వరరావుకు ఘనంగా సన్మానించారు. ఈ సందర్భంగా జిల్లా రోటరీ ఆధ్వర్యంలో చేపట్టిన కార్యక్రమాలను ప్రొజెక్టర్‌పై ప్రదర్శిస్తూ రోటరీ చేసిన ప్రాజెక్టులను తెలిపారు. పోలియో నిర్మూలన కొరకు పిహెచ్‌ఎఫ్ కొరకు ఎలక్ట్ గవర్నర్ పూర్తిస్థాయిలో వివరించారు. అనంతరం సోంపేట పట్టణంలో శివరామ ఉచిత కళ్యాణమండపం కరపత్రాన్ని విడుదల చేస్తూ దాతలు సహకరించాల్సిందిగా కోరారు. రోటరీ ఉద్దాన మెడికల్ సెంటర్ కొరకు రోటరీ ఎలక్ట్ గవర్నర్ వెంకటేశ్వరరావు తనవంతుగా లక్షరూపాయలు చెక్కును అందించారు. ఇటీవల కాలంలో విజయనగరంలో నెంబర్ సెమినార్‌లో ప్లాటినం అవార్డు వచ్చినందుకు దుద్ది శ్రీనావాసరావుకు ముఖ్యఅతిథులు రోటరీ ప్రతినిధులు, స్థానిక ప్రముఖులు అభినందనలు తెలిపారు. పిహెచ్‌ఎఫ్ ఫౌండేషన్‌కు పోలియో నిర్మూలనకు అధిక రుసుం సోంపేట రోటరీ క్లబ్ వచ్చినందుకు సంతోషపడ్డారు.

చిన్నపిల్లల కిడ్నీవ్యాధుల నిపుణుల సందర్శన

విశాలాంధ్ర-పలాస: పలాస ప్రభుత్వాసుపత్రిలో గల దయాలసిస్ కేంద్రాన్ని సోమవారం చిన్నపిల్లల కిడ్నీవ్యాధుల నిపుణులు డాక్టర్ అనిషా (పెడియాట్రిక్ నెఫ్రాలజిస్టు యూనివర్శిటీ ఆఫ్ నార్తు కరోలిన, అమెరికా) డాక్టర్ నివేదిత (నెఫ్రాలజిస్టు, సెయింట్ జాన్స్ మెడికల్ కళాశాల బెంగుళూరు), ఐసిఎంఆర్ డాక్టర్ బాలాజీలు పరిశీలించారు. ఈ సందర్భంగా కిడ్నీ రోగులకు అందుతున్న దయాలసిస్ సేవలను అడిగి తెలుసుకున్నారు. ఎటువంటి సేవలు అందజేస్తున్నారు. ఎన్ని రోజులు దయాలసిస్ కోసం కేంద్రానికి వస్తున్నారు.. రోగులకు ఏఏ మందులు అందజేస్తున్నారు.. వంటి వివరాలు సేకరించారు. దయాలసిస్ కేంద్రంలో రోగులకు అందుతున్న సేవలపై సంతృప్తి వ్యక్తం చేశారు. అనంతరం పలాస వైద్య సిబ్బందితో సమావేశమై కిడ్నీ రోగులకు అందజేయాల్సిన సేవలను వివరించారు. 12 నుంచి 25 సంవత్సరాల వయస్సు లోపు వారికి కిడ్నీ వ్యాధి సోకడంపై ఆందోళన వ్యక్తం చేశారు. వైద్యుల నుంచి సమాచారం సేకరించి వైద్య బృందం ఉద్దాన ప్రాంతంలో గల పలు గ్రామాల్లో వారం రోజుల పాటు పర్యటించి చిన్నారుల నుంచి యువతకు సోకే కిడ్నీవ్యాధిపై సమగ్ర వివరాలు సేకరిస్తారు. కార్యక్రమంలో ఇన్‌చార్జీ సూపరింటెండెంట్ డాక్టర్ కూర్మారావు, డాక్టర్ గీత, ఆసుపత్రి అభివృద్ధి కమిటీ చైర్మన్ డబ్బీరు భవానీశంకర్, కౌన్సిలర్ సవర సోమేష్‌లతో పాటు వైద్య సిబ్బంది పాల్గొన్నారు.

పూర్వపు విద్యార్థుల ఆధ్వర్యంలో మెడికల్ క్యాంపు

విశాలాంధ్ర-కవిటి: మండల కేంద్రమైన కవిటి ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో 1979-80 విద్యా సంవత్సరానికి చెందిన 10వ తరగతి చదివిన విద్యార్థులు అద్వర్యంలో మెగా మెడికల్ క్యాంపు కిమ్స్ హాస్పిటల్ శ్రీకాకుళం వారి సౌజన్యం తో ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా పాఠశాలలో విద్యను అభ్యసిస్తున్న 150 మంది విద్యార్థులకు వైద్య పరీక్షలు నిర్వహించారు. 50 మంది పెద్దలకు ఈసీజీ చేసి మందులు అందజేశారు. ప్రభుత్వ ఉన్నత పాఠశాల, జిల్లా పరిషత్ ఒరియా ఉన్నత పాఠశాల, మండల పరిషత్ ప్రాథమిక పాఠశాల విద్యార్థులు సుమారు 380 మందికి పరీక్షలు నిర్వహించి అవసరమైన విద్యార్థులకు మందులను అందజేశారు. ఈ కార్యక్రమంలో ప్రధానోపాధ్యాయుడు బి మల్లేశ్వరరావు,మండల కోఆప్షన్ సభ్యులు పాండవ చంద్రశేఖర్,మాజీ పిఎసిఎస్ అధ్యక్షులు పులకల శ్రీరాములు,కిమ్స్ ఆసుపత్రి వైద్యులు శరత్, ప్రశాంతి, హరిత, జేమ్స్ కో ఆర్డినేటర్ చిన్నారావు, స్థానిక కమ్యూనిటీ హెల్త్ సెంటర్ సిబ్బంది, పూర్వపు విద్యార్థులు కీలు చంద్ర శేఖర్, పొల్లయి వాసుదేవరావు, తోట రామారావు, ప్రియా పద్మనాభం, బల్లెడ మన్మథరావు, దుక్క జోగులయ్య, బొర్రా గోపి, మొగిలిపూరి రామారావు, హిమగిరి, తమరాల సత్యనారాయణ, పి.వీరస్వామి తదితరులు పాల్గొన్నారు.

నిరుపేదలకు అండగా ఉద్దానం యూత్ క్లబ్

విశాలాంధ్ర-కవిటి : నిరుపేదలకు అండగా ఉద్దానం యూత్ క్లబ్ నిలుస్తుందని ఉద్దానం యూత్ క్లబ్ అధ్యక్షులు ఎల్ దీనబంధు తెలియజేశారు. ఈ మేరకు సోమవారం మండలంలోని బొరివంక కేంద్రంగా పనిచేస్తున్న ఉద్దానం యూత్ క్లబ్ ఆధ్వర్యంలో గత కొన్ని సంవత్సరాలుగా అమలు చేస్తున్న శ్రీ అసిరిపోలమ్మ అమృత కలశం కార్యక్రమంలో భాగంగా అదే గ్రామంలోని పురియా వీధికి చెందిన నిరుపేద మహిళ సావిత్రి పురియా కు రెండు నెలలకు సరిపడా నిత్యవసర సరుకులను పంపిణీ చేశారు. ఈ సందర్భంగా క్లబ్ అధ్యక్షులు దీనబంధు మాట్లాడుతూ తమ క్లబ్ ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న ఈ నిత్యవసర సరుకులు పంపిణీలో భాగంగా క్లబ్ కు చెందిన గౌరవ సభ్యులు పూర్ణచందర్ కుమార్తె అన్విష పుట్టినరోజు సందర్భంగా వారి కుటుంబ సభ్యులైన గోరకల పురుషోత్తం చేతుల మీదుగా ఈ సరుకులు పంపిణీ చేసినట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో పంచాయతీ వార్డు మెంబర్ జగన్నాథ్ పురియ, గ్రామ పెద్ద లవ పురియ, క్లబ్ కార్యదర్శి వెంకటేష్, సభ్యులు తిరుపతి, మోహన్, దొంబురు, ధర్మరాజు తదితరులు పాల్గొన్నారు.

11 మంది వైఎస్సార్ సిపి అభ్యర్థులు ఏకగ్రీవ ఎన్నిక

విశాలాంధ్ర-పాతపట్నం: నియోజకవర్గ పరిధిలోని ఐదు మండలాల్లో జరిగిన ఉప ఎన్నికల్లో ఏకగ్రీవంగా ఎన్నికైన 10మంది వైఎస్ఆర్సీపీ వార్డు మెంబర్లు, పాతపట్నం లోని శాసనసభ్యురాలు క్యాంపు కార్యాలయం నందు ఎమ్మెల్యే రెడ్డి శాంతిని మర్యాద పూర్వకంగా కలిశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే రెడ్డి శాంతి వారికి శుభాకాంక్షలు తెలియజేస్తూ రాష్ట్ర అభివృద్ధి, సంక్షేమం తనకు రెండు కళ్ళుగా భావిస్తూ సువర్ణ పాలన అందిస్తున్న జగనన్న ప్రభుత్వం మరింత బలోపేతానికి మీవంతు మరింత కృషి చేసి రానున్న ఎన్నికల్లో వైఎస్సార్సీపీ అత్యధిక మెజారిటీతో గెలుపొందేలా పనిచేయాలని వారిని కోరారు.

మాకు ఇంకెప్పటికి న్యాయం జరుగుతుందో!

- ఎమ్మెల్యేను ప్రశ్నించిన నిర్వాసితులు

విశాలాంధ్ర-మెళియాపుట్టి: ఆఫ్షోర్ రిజర్వాయర్ నిర్మాణ ప్రక్రియకు సంబంధించి చీపురుపల్లి నిర్వాసితులకు ఇంకెన్నాళ్లకు మాకు న్యాయం జరుగుతుందని ఎమ్మెల్యే రెడ్డి శాంతికి ప్రశ్నించారు. తహసిల్దార్ ఆధ్వర్యంలో చీపురుపల్లిలో సోమవారం జరిగిన కార్యక్రమంలో ఎమ్మెల్యే రెడ్డి శాంతి పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఏ.బాలకృష్ణ మాట్లాడుతూ తమ గ్రామంలోని పలువురు ప్రజలకు ఇంకా పూర్తిస్థాయిలో ప్రభుత్వం అందించే ప్యాకేజీ అందలేదని, అంత్యోదయ కార్డులు కూడా లేవని, గ్రామం నుంచి దాసుపురం ఆర్ అండ్ ఆర్ కాలనికు, పలాస మండలంలోని గోపి వల్లభాపురానికి నిర్వాసితులను తరలించినా కనీసం వారికి అవసరాలైన విద్యుత్ లైట్లు, రహదారులు కల్పించలేదని దీంతో ఇళ్ళల్లోకి పాములు కూడా చొరబడి తీవ్ర ఇబ్బందులు పడుతున్నామని, ఇటీవల కాలంలో ఓ వ్యక్తి పాముకాటుకు సైతం గురయ్యారన్నారు. ఉపసర్పంచ్ పిట్ట సవరయ్య మాట్లాడుతూ 2008వ సంవత్సరంలో అప్పటి ముఖ్యమంత్రి వైఎస్ రాజశేఖరరెడ్డి శంకుస్థాపన చేసి నేటికి దశాబ్దకాలం గడిచినా అందరికీ సమన్యాయం ఎందుకు జరగలేదన్నారు. ప్రతి నిర్వాసితునికి న్యాయం జరిగేలా చూడాలన్నారు. సర్పంచ్ యవ్వారి ఈశ్వర్ రావు మాట్లాడుతూ తమ గ్రామ సమస్యలను ప్రజాప్రతినిధులు, జిల్లా కలెక్టర్ దృష్టికి తీసుకువెళ్ళామని తెలియజేస్తూనే ఇప్పటికైనా మా గ్రామ నిర్వాసిత ప్రజల సమస్యల పరిష్కారానికి కృషి చేయాలన్నారు. అనంతరం తహశీల్దారు మాట్లాడుతూ అప్పుడు నుండి ఇప్పటివరకు జరిగిన వివరాలను సభలో తెలియజేశారు. అనంతరం ఎమ్మెల్యే రెడ్డి శాంతి మాట్లాడుతూ నిర్వాసితులు ఎదుర్కొంటున్న సమస్యలను ముఖ్యమంత్రి దృష్టికి తీసుకుని వెళ్లి వాటి పరిష్కారానికి తను తీవ్రంగా కృషి చేస్తున్నట్టుగా తెలియజేస్తూనే వాటి పరిష్కారానికి కృషి చేస్తానని హామీ ఇచ్చారు. ఈ కార్యక్రమంలో ఎమ్మెల్యే పాటు జెడ్పీటీసీ గూడ ఎండయ్య, పలువురు సర్పంచులు, అధికారులు, గ్రామస్తులు తదితరులు పాల్గొన్నారు.

మౌళిక సదుపాయాలకు పెద్దపీట : ఎంపీపీ దాసు



విశాలాంధ్ర-సోంపేట : గ్రామాలు, పట్టణాల్లో మౌళిక సదుపాయాల కల్పనే ధ్యేయంగా వైఎస్సార్ సీపీ ప్రభుత్వం కృషి చేస్తుందని ఎంపీపీ డాక్టర్ నిమ్మన దాసు అన్నారు. ఈ మండలం బారువ మేజర్ పంచాయతీ కొత్తూరు గ్రామంలో సిమెంట్ రోడ్డు నిర్మాణానికి సోమవారం శంకుస్థాపన చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ గ్రామాల్లో రహదారులు, త్రాగునీరు, విద్య, వైద్యం మొదలైన వాటి విషయంలో అభివృద్ధి పట్ల ముఖ్యమంత్రి వైఎస్ జగన్ తీసుకున్న చొరవ ఎనలేనిదని అన్నారు. రహదారి నిర్మాణం పట్ల స్థానికవైకాపా నేతలు, గ్రామస్తులు హర్షం వ్యక్తం చేశారు. ఈ కార్యక్రమంలో వైస్ ఎంపీపీ గుర్రాల శ్రీను, సర్పంచ్ ఎర్ర రజిని, ఎంపీటీసీ సభ్యులు తామాడ పద్మ, ఉపసర్పంచ్ రాజు, భువనేశ్వర పాణిగ్రాహి, అమర లోకనాథం ఇఓపిఆర్డి వాసుదేవరావు తదితరులు పాల్గొన్నారు.

పేదోడి సొంత ఇంటి కల జగనన్నతోనే సాధ్యం

ఇచ్ఛాపురం నియోజకవర్గ వైఎస్ఆర్సిపి సమన్వయకర్త, మాజీ ఎమ్మెల్యే పిరియా సాయిరాజ్

విశాలాంధ్ర-కవిటి: పేదోడి సొంత ఇంటి కల జగనన్నతోనే సాధ్యపడుతుందని ఇచ్ఛాపురం నియోజకవర్గ వైఎస్ఆర్సిపి సమన్వయకర్త, మాజీ ఎమ్మెల్యే పిరియ సాయిరాజ్ అన్నారు. ఈ మేరకు సోమవారం మండల కేంద్రమైన కవిటి టౌన్లో గల జగనన్న ఇళ్ళు కాలనీ లోని ప్రభుత్వ స్థలాల్లో గృహాలు నిర్మించుకొని, గృహ నిర్మాణ సంస్థ నుంచి రుణం పొందిన నెయ్యిల రజిని కృష్ణారావు అనే లబ్ధిదారుడు నిర్మించుకున్న ఇంటిని మాజీ ఎమ్మెల్యే సాయిరాజ్ చేతుల మీదుగా ప్రారంభించారు. ఈ కార్యక్రమంలో వైస్ సర్పంచ్ దేవాడ కుమారి దుర్యోధన, బెందాలం రమణ, నెయ్యిల కృష్ణారావు తదితరులు పాల్గొన్నారు.

రోడ్డు నిర్మించాలి

విశాలాంధ్ర-వజ్రపుకొత్తూరు : మండలం బైపల్లి నుంచి సముద్రం ఒడ్డున గల శ్మశానం వరకు 3 కిలోమీటర్లు కంకర రోడ్డు నిర్మించాలని సర్పంచ్ ప్రతినిధి దొంక విద్యాసాగర్ కోరారు. ఈ మేరకు సోమవారం ఎంపిడివో కార్యాలయంలో నిర్వహించిన స్పందన కార్యక్రమంలో ఎంపిపి ఉప్పరపల్లి నీలవేణి ఉదయ్‌కుమార్‌కు వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ శ్మశానికి వెళ్లే ప్రజలు రహదారి సౌకర్యం లేక తీవ్ర ఇబ్బందులు పడుతున్నారని, ఈ విషయమై ఎన్నిసార్లు అధికారుల దృష్టికి తీసుకువెళ్లినా సమస్య పరిష్కారం కాలేదని ఆవేదన వ్యక్తం చేశారు. ఇప్పటికైనా అధికారులు, ప్రజాప్రతినిధులు స్పందించి రహదారి నిర్మాణానికి చర్యలు తీసుకోవాలని ఆయన కోరారు.

ప్రభుత్వ పథకాలందేలా చూడాలి

విశాలాంధ్ర-పలాస : రాష్ట్ర ప్రభుత్వం అందిస్తున్న సంక్షేమ పథకాలను ప్రజలకు అందేలా చూడాలని మున్సిపల్ చైర్మన్ బల్ల గిరిబాబు మెప్మా అధికారులకు సూచించారు. పలాస మున్సిపల్ కార్యాలయంలో సోమవారం మెప్మా అధికారులతో ఆయన సమావేశం నిర్వహించారు ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పార్టీలకు అతీతంగా ప్రభుత్వ సంక్షేమ పథకాలను అందిస్తున్నామన్నారు. ఎవరికైనా ప్రభుత్వ పథకాలు అందలేదని ఫిర్యాదులు వస్తే చర్యలు ఉంటాయని హెచ్చరించారు. బాధ్యతగా పనిచేయాలని, నిరంతరం ప్రజలకు అందుబాటులో ఉండాలని సూచించారు. సమావేశంలో మున్సిపల్ కమిషనర్ టి.నాగేంద్రకుమార్ మెప్మా అధికారులు తదితరులు పాల్గొన్నారు.

పక్కాగా సర్వే నిర్వహించండి

విశాలాంధ్ర-ఇచ్ఛాపురం : ఎన్నికల సంఘం ఆదేశాలతో చేపట్టిన ఇంటింటి ఓటరు సర్వేను ఎటువంటి పక్షపాత ధోరణి లేకుండా, అధికార ప్రలోభాలకు లొంగకుండా నిర్వహించాలని తెలుగుదేశం పార్టీ బి.సి (రెడ్డిక) సాధికార సమితి కన్వీనర్ కొండా శంకర్ కోరారు. సోమవారం 52వ పోలింగ్ బూత్ పరిధిలో బి.ఎల్.ఓ బాలక్రిష్ణ ఆధ్వర్యంలో జరిపిన సర్వేను పర్యవేక్షించారు. ఓటర్ల చేర్పులు మార్పుల విషయంలో తగిన జాగ్రత్తలు తీసుకుని నిబంధనలకు అనుగుణంగా చేయాలని విజ్ఞప్తి చేసారు.